క్లుప్తంగా

కల్వర్టు ప్రారంభం



పెనుగంచిప్రోలు: ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ అన్నారు. పెనుగంచిప్రోలు–ముండ్లపాడు రోడ్డులోని చెరువుకట్ట వద్ద రూ.కోటితో నిర్మించిన కల్వర్టును శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నెలల్లో కల్వర్టు నిర్మాణాన్ని పూర్తి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పూట్ల నాగమణి, ఎంపీటీసీ సభ్యురాలు జంగం వీరమ్మ, మండల టీడీపీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, మాజీ జెడ్పీటీసీ సభ్యులు గజ్జి కృష్ణమూర్తి, మాజీ ఎంపీపీ వేగినేటి గోపాలకృష్ణమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

లక్ష్యాలు చేరుకునేందుకు కృషి

పశు సంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు



నందిగామ రూరల్: పశు వైద్యాధికారులు నిర్దేశించిన సమయానికి తమ లక్ష్యాలను చేరుకునే విధంగా కృషి చేయాలని పశు సంవర్ధక శాఖ జేడీ హనుమంతరావు తెలిపారు. పట్టణంలోని పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో డీడీ డాక్టర్ మోజేస్ వెస్లీ ఆధ్వర్యంలో డివిజన్ స్థాయిలోని పశు సంవర్ధక శాఖాధికారులతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు రాయితీపై అందజేస్తున్న పశువుల దాణా నిర్దేశించిన సమయానికి పంపిణీ చేయాలని సూచించారు. వికసిత్ భారత్‌లో భాగంగా 2025–2047 సంవత్సరాలకు పాలు, గుడ్లు, మాంసం దిగుబడి పెంచే విధంగా పశు వైద్యాధికారులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు శ్రీనివాసులు, పలువురు పశు సంవర్ధక శాఖాధికారులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

వీరులపాడు: గ్రామీణ ప్రాంత రైతుల వ్యవసాయ భూములకు సంబంధించిన సమస్యలను తక్షణమే పరిష్కరించేలా వీఆర్వోలు కృషి చేయాలని తహసీల్దార్ హుసేన్ ఆదేశించారు. మండలంలోని జుజ్జూరు తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన వీఆర్వోలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్వోలు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ముఖ్యంగా రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు.

ఎంపీడీఓగా పదోన్నతి పొందిన శ్రీనివాసరావుకు సత్కారం



కంచికచర్ల: మండల పంచాయతీ విస్తరణాధికారిగా పనిచేసిన బొజ్జగాని శ్రీనివాసరావు ఎంపీడీఓ గా పదోన్నతి పొంది బదిలీ అయ్యారని ఎంపీడీఓ బీఎం విజయలక్ష్మి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం శ్రీనివాసరావుకు పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. ఈ మేరకు ఎంపీడీఓ మాట్లాడుతూ శ్రీనివాసరావు ఈఓపీఆర్డీగా పనిచేసినంతకాలం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో 100 శాతం ఇంటిపన్ను, నీటి పన్ను వసూలు చేశారని చెప్పారు. గ్రామాల్లో ప్రజలు విషజ్వరాల బారిన పడకుండా శానిటేషన్ పనులు చేపట్టే విషయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఉత్తమ ఈఓపీఆర్డీగా నాలుగుసార్లు జిల్లా కలెక్టర్‌ను నుంచి ఉత్తమ అవార్డుతో పాటు ప్రశంసాపత్రాలు అందుకున్నారని పేర్కొన్నారు. ఎంపీడీఓగా పదోన్నతిపై ఏ కొండూరు మండలానికి బదిలీపై వెళ్లడం సంతోషదాయకమని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ ఇందుపల్లి నాని బాబు, పంచాయతీ కార్యదర్శుల సంఘ నాయకులు ఎస్.సుబ్రహ్మణ్యం, పంచాయతీ రాజ్ ఏఈఈ టీవీ రవికుమార్, ఎంఈఓ బాలాజీనాయక్, ఏపీఓ రమాదేవి, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెంటెంట్ ఆనంద కమల కుమారి, గ్రామ పంచాయతీ సీనియర్ అసిస్టెంట్ వెల్లంకి రామారావు, ఆయా గ్రామ సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

కరాటే సాధనతో ఆత్మస్థైర్యం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కరాటే సాధన చేయడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి పేర్కొన్నారు. ఉచిత కరాటే తరగతుల్లో శిక్షణ పొంది, వివిధ బెల్టు గ్రేడ్‌లు సాధించిన విద్యార్థులకు శనివారం బెల్టులను అందజేసి అభినందించారు.

సేంద్రియంతో భూమి బంగారం

- పశువుల వ్యర్థాలపై రైతుల ఆసక్తి
- తగ్గనున్న పెట్టుబడులు
- అధిక రసాయనిక ఎరువుల వాడకంతో అనర్థం
- రైతులకందని పచ్చిరొట్ట విత్తనాలు



పంట పొలంలో మందకట్టిన గొర్రెలు



పశువుల వ్యర్థాలను ట్రాక్టర్ ద్వారా పొలానికి తరలిస్తున్న దృశ్యం

వత్సవాయి: రైతులు పంటలకు అధికంగా రసాయనిక ఎరువులు వాడడంవల్ల భూమిలో సారం తగ్గిపోయి దిగుబడులు క్రమేపీ తగ్గిపోయే అవకాశం ఉంది. విచ్చలవిడి రసాయనిక ఎరువుల వాడకం వల్ల భూమి తన సహజ లక్షణాన్ని కోల్పోయి చౌడు భూములుగా మారిపోయే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. మారుతున్న పరిస్థితులకనుగుణంగా రైతుల ఆలోచనల్లో మార్పు వచ్చింది. దీంతో రైతులు కూడా పశువుల వ్యర్థాలను పంట పొలాల్లో కలపడంతో భూసారాన్ని పెంచుకోవడంపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. దిగుబడుల అధికం కోసం మార్కెట్లో వస్తున్న కొత్తరకం రసాయనిక మందులను వాడుతున్న తరుణంలో భూమిలో సారం తగ్గడంతో ప్రతి ఏడాది దిగుబడులు అంతకంతకు తగ్గుతున్నాయి. దీంతో సేంద్రియ ఎరువుల ఆవశ్యకత ఎక్కువైంది. రసాయనిక ఎరువుల వల్ల భూమిలో క్షారం క్షీణించి పైర్లకు అధిక స్థాయిలో తెగుళ్లు ఆశిస్తున్నాయి. వీటిని నివారించుకోవాలంటే ప్రకృతి సిద్ధమైన ఎరువును భూమిలో కలపాల్సిన అవసరాన్ని రైతులు గుర్తిస్తున్నారు. మాగాణి, మెట్ట భూములకు గేదలు, ఆవులు, గొర్రెల, మేకల విసర్జితాలను కొనుగోలు చేసి పంట పొలాలకు తొలుతున్నారు. పంట ఏపుగా పెరిగి అధిక దిగుబడులు అందించేందుకు దోహదపడుతుందని రైతులు చెబుతున్నారు. వేరే ప్రాంతాల నుంచి మేత కోసం వచ్చే గొర్రెలు, మేకల కాపరులకు ఎక్కువ డిమాండ్ పలుకుతుంది. పగలంతా వేరే ప్రాంతాల్లో మేపుకుని వచ్చి రాత్రికి వారు ఎంచుకున్న పొలంలో వీటిని ఉంచుతారు. ఒక రాత్రి పొలంలో గొర్రెలను ఉంచినందుకు రూ.800 నుంచి 1000 వరకు కాపరులు రైతుల నుంచి తీసుకుంటారు.

సేంద్రియ ఎరువుల వల్ల ఉపయోగాలు...

భూమిలో తేమశాతం పెరగడంతోపాటు మొక్కలకు సరిపోను తేమను అందించేందుకు ఉపయోగపడుతుంది. పంటకు కావలసిన ముఖ్య పోషకాలు సేంద్రియ ఎరువుల వల్ల అందుతాయి. సారవంతమైన సేంద్రియ ఎరువును భూమిలో కలపడం ద్వారా మొక్క త్వరగా భూమిలోకి చొచ్చుకుని పోయి ఏపుగా పెరుగుతుంది. సేంద్రీయ ఎరువును ఎండాకాలంలో ట్రాక్టర్‌తో దుక్కిదున్నే ముందు భూమిలో చల్లి కలియదున్నితే పెద్ద వర్షాలకు సేంద్రీయ ఎరువు కొట్టుకుపోకుండా ఉంటుంది. మందుకట్టలు పెట్టుబడి తగ్గుతుంది.

ఎరువులు లభ్యత.....

పశువుల వ్యర్థాలను పొలాలకు తోలుకోవడంతోపాటు,, గొర్రెలు, మేకలను పొలంలో మందకట్టించడం, కోళ్ల వ్యర్థాలు వాంటి వాటిలో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. పశువుల పేడను కంపోస్టు విధానం ద్వారా నిల్వచేసుకున్న తరువాత పంట పొలాలకు తరలించుకోవాలి. వేపపండి, పొగాకు పిట్టు వంటివి నాణ్యమైనవి కొనుగోలు చేసుకోవచ్చు. అంతేకాకుండా రైతులు సొంతంగా వర్మీకంపోస్టు ఏర్పాటుచేసుకుని సేంద్రీయ ఎరువును తయారుచేసుకోవచ్చు.

పచ్చిరొట్ట పైర్లను సాగుచేయుట...

పశువుల వ్యర్థాలు, వర్మీకంపోస్టు ఎరువులు లభ్యత కానీ రైతులు పచ్చిరొట్ట పైర్లను కూడా సాగుచేసుకోవచ్చు. పంటలు వేసేందుకు కనీసం నెల రోజులు ముందుగా పెసర, పిల్లిపెసర, జీలుగు, మినుము, బొబ్బర వంటి విత్తనాలను చల్లుకోవాలి అవి బాగా ఏపుగా పెరిగిన తరువాత ట్రాక్టర్‌తో భూమిలోపలికి పోయేలా కలియదున్నుకుంటే కుళ్లిపోయి భూమికి కావాలసిన సారాన్ని అందిస్తుంది. గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసాకేంద్రాల ద్వారా రైతులకు పచ్చిరొట్ట విత్తనాలను మే నెల ప్రారంభంలోనే అందించేవారు. కాగా నేడు ఇంతవరకు రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు చేతికందలేదు.

> **బహుళ ప్రయోజనం**
>
> సేంద్రియ ఎరువులను వాడటం వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయి. పశువుల వ్యర్థాలు, పచ్చిరొట్ట పైర్లను సాగుచేయడం వలన భూమి సారవంతమవుతుంది. దీంతో పంట ఏపుగా పెరగడంతోపాటు పెట్టుబడులు కూడా తగ్గుతాయి. విచ్చిలవిడిగా రసాయనిక ఎరువుల వాడకం వల్ల చౌడు భూములుగా మారుతాయి.
>
> – వి.రవికుమార్, ఏవో వత్సవాయి

బండిపాలెంలో కళ్లజోళ్ల పంపిణీ

బండిపాలెం(జగ్గయ్యపేట): గ్రామంలోని సచివాలయంలో జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు చేయించుకున్న వారికి ఫౌండేషన్ ప్రతినిధులు శనివారం కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఇటీవల ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ప్రతినిధి కట్టా వెంకట నరసింహారావు మాట్లాడుతూ 92 మందికి కళ్లజోళ్లు అందజేశామన్నారు. శుక్లాల ఆపరేషన్ అవసరమని గుర్తించిన వారికి త్వరలో ఆపరేషన్‌లు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎలిశమ్మ, నాయకులు అడుసుమల్లి ప్రభాకర్, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

అహల్యాభాయ్ కృషి మరువలేనిది

నందిగామ టౌన్:స్వాతంత్ర్యానికి పూర్వం దేశంలో ధ్వంసమైన పలు ఆలయాల పునరుద్ధరణకు అహల్యాభాయ్ చేసిన కృషి మరువలేనిదని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొడ్డు నాగలక్ష్మి పేర్కొన్నారు. పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో లలితా విష్ణు జ్ఞాన వాహిని మహిళా మండలి ఆధ్వర్యంలో శనివారం అహల్యాభాయ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలు చారిత్రక హిందూ దేవాలయాల సంరక్షణ, పునరుద్ధరణకు అహర్నిశలు కృషి చేశారన్నారు. హిందూ సాంస్కృతిక, సంప్రదాయలతో పాటు ఆలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి నాయకులు వెచ్చ ఉమామహేశ్వరీ, నాయకులు తొర్లికొండ సీతారామయ్య, కామేశ్వరరావు, కేదార్‌నాథ్, సత్యనారాయణ గుప్త, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి మందికి మజ్జిగ పంపిణీ

నందిగామ రూరల్:పట్టణంలోని సత్య దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో వెయ్యి మందికి మజ్జిగ పంపిణీ చేశారు. మెయిన్ బజార్‌లో ఏర్పాటు చేసిన సత్య దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద శనివారం వెల్లంకి రామచంద్రరావు కుటుంబ సభ్యులు, హర్యానా జిలేబీ నిర్వాహకులు భగీరథ, జగదీష్‌ల సహకారంతో మజ్జిగ పంపిణీ చేసినట్లు సేవా సమితి నిర్వాహకుడు కోటి సూర్యం తెలిపారు. ఈ సందర్భంగా మజ్జిగతో పాటు ప్రతి రోజు చల్లని తాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

కరెంట్ పోల్ తొలగించకుండా కల్వర్టు నిర్మాణం



గండేపల్లిలో ఆర్ అండ్‌బీ రోడ్డు మధ్యలో ఉన్న కరెంట్ పోల్‌ను తొలగించకుండా కల్వర్టు నిర్మాణ పనులు

కంచికచర్ల: రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ఉన్నా దానిని తొలగించకుండా గుత్తేదారుడు కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ విషయం ఆర్‌అండ్‌బీ అధికారులకు చెప్పినా పెడచెవిన పెట్టారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలోని గండేపల్లి నుంచి వీరులపాడు మండలం బోడవాడ, జమ్మవరం వెళ్లే ఆర్ అండ్‌బీ రోడ్డుపై సుబ్బరాజు చెరువు కట్ట సమీపంలో వాగు ఉంది. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు ఆ వాగు పొంగి పొర్లుతుంది. పంట పొలాల్లో వరద నీరంతా వాగులోకి రావటంతో వాహనాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. గ్రామస్తులు, వాహనదారులు ఈ విషయాన్ని ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కల్వర్టు నిర్మాణానికి రూ.12లక్షల నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో గుత్తేదారుడు కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టారు. కాని ఆ కల్వర్టుపక్కనే ఆనుకుని విద్యుత్ స్తంభం ఉంది. కానీ ఆ విద్యుత్ స్తంభాన్ని తొలగించకుండా కాంట్రాక్టర్ కల్వర్టు నిర్మాణం చేశారు. వాగుపై కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టినా కానీ విద్యుత్ పోల్ వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ పోల్‌ను తొలగించి కల్వర్టు పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు గ్రామస్తులు, రైతులు విన్నవించుకున్నా వారి మాటలు పెడచెవిన పెట్టి నిర్మాణ పనులు పూర్తిచేశాడు. ఈ విషయాన్ని ఆర్‌అండ్‌బీ శాఖ డీఈఈకి ఫిర్యాదు చేసినా కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై పట్టించుకోవటంలేదని గ్రామస్తులు, వాహనదారులు అంటున్నారు. ఇప్పటికైనా రోడ్డు భవనాల శాఖ అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న విద్యుత్ పోల్‌ను తొలగించి కల్వర్టు నిర్మాణ పనులు పూర్తిచేయాలని గ్రామస్తులు, రైతులు, వాహనదారులు కోరుతున్నారు.

దివ్యాంగులకు వినికిడి యంత్రాలు పంపిణీ

జగ్గయ్యపేట అర్బన్: అలింకో ఫౌండేషన్ సహకారంతో స్వయంశక్తి విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నియోజకవర్గానికి చెందిన ఐదుగురు దివ్యాంగులకు వినికిడి యంత్రాలను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) చేతులు మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా శనివారం ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వడ్డేపూడి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పేట మండలం, మల్కాపురం గ్రామానికి చెందిన జ్ఞానేశ్వరి, వత్సవాయి మండలం, భీమరం గ్రామానికి చెందిన సంగెపు లక్ష్మీనారాయణ, భువనగిరి వెంకటేశ్వర్లు, తాడాలపల్లి వెంకటేశ్వర్లు, జగ్గయ్యపేటకు చెందిన కంచెర్ల సునీతలకు వినికిడి యంత్రాలను అందజేసినట్లు తెలిపారు. వినికిడి యంత్రాల మంజూరుకు కృషిచేసిన సంఘ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావును ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో సంఘ నియోజకవర్గ కార్యదర్శి గోనె విజయలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

రహదారులపై వ్యర్థాలతో అవస్థలు



బలుసుపాడు-అన్నవరం ప్రధాన రహదారిలో రోడ్డుకు ఇరుపక్కలా ఉన్న చెత్త కుప్పలు



అన్నవరం వెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డు పక్కనే దర్శనమిస్తున్న ఎరువు కుప్పలు

జగ్గయ్యపేట: మండలంలోని పలు గ్రామాల్లో రోడ్డుకు ఇరుపక్కలా చెత్త కుప్పలుండటంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. ఒక పక్క ప్రభుత్వం ప్రతి నెలా స్వచ్ఛంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా తడిపొడి చెత్తపై అవగాహన కలిగిస్తున్నప్పటికీ ఆయా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కలిగించటంలో గ్రామ స్థాయి అధికారులు, పంచాయతీ సిబ్బంది పూర్తిగా విఫలమవుతున్నారు. దీంతో రహదారుల వెంబడి ఇష్టానుసారం చెత్తను వేస్తున్నారు. మండలంలో 19 గ్రామ సచివాలయాలుండగా ధర్మవరప్పాడుతండ, జయంతిపురం, బలుసుపాడు, అన్నవరం, గౌరవరం, పోచంపల్లి, షేర్‌మహ్మద్‌పేట, తదితర గ్రామాల ప్రధాన రహదారుల వెంబడే చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. కనీసం పంచాయతీ అధికారులు రోడ్ల పక్కనే చెత్త పడేస్తున్నా కనీస చర్యలు తీసుకోవటం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో కురిసే వర్షాలకు అంటువ్యాధులు ప్రబలే అవకాశముందని భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా చెత్త కుళ్లి దుర్గంధం వెదజల్లటంతో పాటు దోమల ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పిల్లల విషయంలో అప్రమత్తంగా ఉండాలి

న్యాయమూర్తి హిమబిందు



మాట్లాడుతున్న న్యాయమూర్తి హిమబిందు

జగ్గయ్యపేట అర్బన్: చిన్న పిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి హిమబిందు తెలిపారు. ఈ నెల 25 వ తేదీన పిల్లల మిస్సింగ్ డే సందర్భంగా శనివారం స్థానిక కింగ్స్ స్పోకెన్ ఇంగ్లిష్ ఇనిస్టిట్యూట్‌లో మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి హిమబిందు మాట్లాడుతూ పిల్లలు గుర్తు తెలియని వ్యక్తులతో మాట్లాడవద్దని, పరిచయం లేని వారి నుంచి చాక్‌లెట్లు గానీ, బహుమతులు గానీ తీసుకోవద్దని సూచించారు. ఒంటరిగా ప్రయాణించవద్దని, పాఠశాల, ట్యూషన్, ఆటలకు వెళుతున్నపుడు స్నేహితులు లేదా పెద్దలతో వెళ్లాలని తెలిపారు. అత్యవసర సమయంలో సమాచారం అందించేందుకు పిల్లలు తల్లిదండ్రుల ఫోన్ నెంబర్, ఇంటి అడ్రస్ గుర్తుపెట్టుకోవాలని చెప్పా రు. ఎవరైనా బలవంతంగా తీసుకువెళ్లేందుకు ప్రయత్నిస్తుంటే వీరు నాకు తెలిసిన వారు కాదని గట్టిగా అరవాలని తెలిపారు. ఏదైనా సమస్యలు ఉంటే అత్యవసర నంబర్లు 100 (పోలీసు), 1098 (చైల్డ్ హెల్ప్ లైన్)కు ఫోన్ చేయాలని తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు, సెక్రటరీ మెట్టెల ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు దాసరి నాగేశ్వరరావు, న్యాయవాదులు రాయపూడి శ్రీనివాసరావు, అన్నెపాగ కరుణ, ఉప్పుతళ్ల అంకమరాజు, మురళి, నరేష్, శ్రావణకుమార్, విజయకుమారి, ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ అమరనాథ్, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

యోగాసనాలపై అవగాహన



విద్యార్థులకు మెడిటేషన్‌పై అవగాహన కల్పిస్తున్న యోగా టీచర్

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శనివారం ముందుగా విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం యోగా గురువు డి.రామలక్ష్మీపతి యోగాసనాలు, మెడిటేషన్‌తో కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. విద్యార్థులతో ధ్యానం చేయించారు. అలాగే ఉపాధ్యాయురాలు కె.పుష్పలత మై సెల్ఫ్ అనే వ్యక్తిగత పరిచయం అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది శ్యామల, రమేష్, రాము పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లపై పిడుగుపాటు.. రైతుకు చేటు!

- నెల రోజుల వ్యవధిలో భారీగా కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు
- డిమాండ్‌కు తగ్గ ట్రాన్స్‌ఫార్మర్లు సరఫరా కాక రైతులకు ఇక్కట్లు
- ఎండుతున్న ఉద్యాన వన పంటలు, పశుగ్రాసం
- ఆందోళనలో రైతులు



కీసరలో సాగునీరు లేక ఎండిపోతున్న పశుగ్రాసం

కంచికచర్ల : అప్పటి వరకు భానుడు భగభగలు.. అంతలోనే వాతావరణం చల్లబడటం.. ఆపై ఉరుములు, మెరుపులు, గాలిదుమ్ముతో కూడిన భారీ వర్షాలు.. మధ్య మధ్యలో పిడుగుపాట్లు ఇవీ నెల రోజులుగా జిల్లాలో వాతావరణ పరిస్థితులు.. ఈ అకాల వర్షాలు... పిడుగుపాటుకు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. ఫలితంగా ట్రాన్స్‌ఫార్మర్ల కింద సాగులో ఉన్న భూములు ఎండుముఖం పట్టి రైతులకు ఇబ్బందులు తప్పటంలేదు. జిల్లాలో గత పది రోజుల వ్యవధిలో వందల సంఖ్యలో అకాల వర్షాల పిడుగుపాటుకు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్లపై తరచూ పిడుగుపాట్లు రైతుల్లో ఆందోళన రేకెత్తిస్తుంది. గత నెల 10వ తేదీ నుంచి ఇప్పటి వరకు పరిశీలిస్తే జిల్లాలో వందలాది ట్రాన్స్‌ఫార్మర్లు గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ నెలలో కాలిపోయాయి. వాస్తవానికి ప్రస్తుత పంట సీజన్ తక్కువయినా పశుగ్రాసం, అరటి, నిమ్మ తదితర ఉద్యానవన పంటలకు నీటి తడులు అందించలేక రైతులు అల్లాడుతున్నారు. ప్రధానంగా ఎన్టీఆర్ జిల్లా పశ్చిమ ప్రాంతం నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో పశుగ్రాసం, నిమ్మ, అరటి సాగు చేసే రైతుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది.

రైతుల ఇక్కట్లు....

వాస్తవానికి ప్రస్తుత కాలంలో రబీ, ఖరీఫ్ సీజన్‌ల పంటల సాగు తక్కువగా ఉంటుంది. నిమ్మ, అరటి, మిర్చి వగైరా ఉద్యాన పంటలతో పాటు పశుగ్రాసం ఎక్కువగా సాగు చేస్తారు. ప్రకృతి వైపరీత్యాలు, అకాల వర్షాలు, గాలివాన, పిడుగుపాట్లకు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కువగా కాలాయి. దీంతో రైతులు ఆందోళనకు గురి కావాల్సి వచ్చింది.

డిమాండ్‌కు తగ్గట్టు లేని సరఫరా...

వాస్తవానికి ప్రతి ఎస్పీఎం పరిధిలో రోజుకు రెండు, లేదా మూడు ట్రాన్స్‌ఫార్మర్లు మాత్రమే ఇవ్వగలరు. దీంతో రైతుల అవసరాలకు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్లు అందించలేకపోతున్నారు. కంపెనీ వారెంట్‌తో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో లేకపోవటంతో విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది అయోమయంలో ఉన్నారు. మరమత్తుకు గురయిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు సకాలంలో దిగుమతి కాకపోవటంతో రైతులకు కరెంటు కష్టాలు వచ్చాయి. ఇటీవల కొన్ని ట్రాన్స్‌ఫార్మర్లు రావటంతో సర్దుబాటు చేశారు. రెండు రోజుల క్రితం నుంచి కంచికచర్ల మండలం పరిటాలలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమత్తుకు గురయితే శుక్రవారం బాగు చేశారు.

ఎండుతున్న పంటలు...

జిల్లాలో పాడి ఆధారిత రైతులు అధికంగా ఉన్నారు. ప్రతి రైతు ఇంట్లో కనీసం ఒక మూగ జీవాలు ఉన్నాయి. ప్రస్తుతం నందిగామ నియోజకవర్గంలో ప్రతి రైతు పొలంలో గడ్డిసాగులో ఉంది. కంచికచర్ల మండలంలో అరటి, నిమ్మ, పశుగ్రాసం ఎక్కువగా సాగుచేశారు. కాని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు పిడుగుపాటుకు కాలిపోవటంతో సాగునీరు లేకపోవటంతో పంటలన్నీ ఎండిపోయాయని రైతులు అంటున్నారు. సకాలంలో పిడుగుపాటుకు గురయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

> **వందల సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు....**
>
> విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, ఇతరత్రా సమస్యలతో కొద్ది శాతం ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోగా ఏప్రిల్ చివరివారంలో ఉరుములు, మెరుపులు, పిడుగుపాటుతో కురిసిన అకాల వర్షాలకు ట్రాన్స్‌ఫార్మర్లు ఎక్కువ శాతం కాలిపోయాయి. జిల్లాలో సీపీడీసీఎల్ పరిధిలో నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, ఇబ్రహీంపట్నం, తిరువూరు, విద్యుత్ డివిజన్లు ఉన్నాయి. దాదాపు అన్ని మండలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోగా, అత్యధిక శాతం పశ్చిమ ప్రాంతంలోని నియోజకవర్గాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. 25 కేవీ, 16కేవీ, 15 కేవీ తదితర రకాల ట్రాన్స్‌ఫార్మర్లు నందిగామ డివిజన్‌లో కంచికచర్ల మండలంలో ఐదు, చందర్లపాడు మండలంలో మూడు, నందిగామ రూరల్ మండలంలో 3, జగ్గయ్యపేట డివిజన్‌లో వత్సవాయి మండలంలో 2, పెనుగంచి ప్రోలు మండలంలో నాలుగు, జగ్గయ్యపేట మండలంలో నాలుగు, మైలవరం డివిజన్‌లో జీ కొండూరులో రెండు, ఇబ్రహీంపట్నం మండలంలో ఐదు, మైలవరం మండలంలో ఆరు, తిరువూరు డివిజన్‌లో తిరువూరు మండలంలో నాలుగు, విస్సన్నపేట మండలంలో రెండు, ఏ కొండూరు మండలంలో రెండు చొప్పున విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.
>
> 
>
> పరిటాలలో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

> **చర్యలు తీసుకుంటాం**
>
> ఇటీవల కురిసిన అకాల వర్షాలకు, పిడుగుపాటుకు జిల్లా అంతటా ట్రాన్స్‌ఫార్మర్లు సుమారు 15లోపే కాలిపోయాయి. ప్రతి ఎస్పీఎం పరిధిలో మరమ్మతులకు గురయిన స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నాం. వారెంటీ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను మాత్రమే బిగిస్తున్నాం.
>
> – ఎం.వసంతరావు విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, ఇబ్రహీంపట్నం

ఆన్‌లైన్ సేవా కేంద్రం ప్రారంభం



సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున యూటీఎఫ్ నాయకులు

కంచికచర్ల: ఉపాధ్యాయుల బదిలీల ఆన్‌లైన్ దరఖాస్తుల సేవలను ఉచితంగా అందజేస్తున్నామని ఐక్య ఉపాధ్యాయ సంఘ (యూటీఎఫ్) జిల్లా కార్యదర్శి, జిల్లా నాయకులు డి.హరిప్రసాద్, కోపూరు నాగేశ్వరరావు, కామా ప్రభాకర్ తెలిపారు. ఏపీఎన్జీఓస్ సంఘ కార్యాలయంలో ఉపాధ్యాయుల బదిలీ ఆన్‌లైన్ దరఖాస్తుల సేవా కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ మేరకు సంఘ నాయకులు మాట్లాడుతూ కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో ఉపాధ్యాయులుగా పనిచేసే వారి బదిలీలను ఆన్‌లైన్ దరఖాస్తు సేవలు ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. ఈ అవకాశాన్ని రెండు మండలాల ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘ నాయకులు మేరుగ రామారావు, పూల వెంకటేశ్వరరావు, సురేష్, విజయ్‌కుమార్, ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.